

# భవాని

కుమారి జలంధర

ప్రపంచం కోసం బ్రతక డానికి ప్రయత్నించినా, ఆదర్శాల ఆలయంలో బ్రతకాలని ప్రయత్నించినా, ఏమైనా సాఫల్యం లేకుండా పోయింది. అనుభవించిన జీవితమేమో తృప్తి కలగజేయలేక పోయింది. కాంతి నాశనమైంది. ఆరోగ్యం చెడింది. ఆ స్థితిలో అయినా మనిషి గతంలో అనుభవించిన లోటు భర్తీ చేసుకుని, జీవితాన్ని సహజమైన విధంగా ఆనందదాయకమైనదిగా రూపొందించుకొనడానికి మార్గం ఉందా? అంటే...

"అయితే దీనికేం మందు లేదంటారా, డాక్టర్ గారూ?"

"సారీ! లేదు! ఇది మానసికంగా మీరు పెంచుకున్న జబ్బుకానీ, మరొకటి కాదు. ఇది ఒక విధంగా సైకో సొమాటిక్ డిసీజ్. ఈ జబ్బు పోవాలంటే మీరు చాలా మారాలి."

ఆమె నిట్టూర్పు విడిచింది.

ఆమె వంకే పరీక్షగా చూస్తున్నాడు డాక్టర్ మోహన్‌రావు. సౌందర్యవతి అయిన ఈమె ఏ కారణంచేత మిస్ భవానిగా మిగిలిపోయింది?! కాని, ప్రస్తుతం తీరని కోరికలు అవివాహిత అయిన ఆమె బ్రతుకు మీద నీడలు సృష్టిస్తున్నాయి. తన జీవితానికి, తన ఆంతర్యానికి లయ కుదరక విపరీతమైన అలజడికి లోనై, పిచ్చివాళ్లకన్న ఒక్క మెట్టు క్రింద ఉంది భవాని. మానసిక శాస్త్రం చదివిన తను ఈమెకు చాలా సులభంగా సలహా ఇవ్వగలడు. కానీ, ఈమె ఆచరిస్తుందా?

"ఆఁ! మీకు ఎన్నేళ్లున్నారు, మిస్ భవానీ?".

"ముప్ఫై ఎనిమిది." మెల్లిగా అంది.

"సాధారణంగా ఈ వయస్సులో ప్రతి స్త్రీకి స్త్రీత్వం పోయి మాతృత్వం ప్రకోపిస్తుంది. ఏ కారణం వల్లనో మీలో అలాంటి పరిణతి రాలేదు. ఈ వయస్సుకు తీయని అనుభూతులు, దాచుకున్న అనుభవాలు ఉంటాయి ప్రతి మనిషికి. అవి చాలు అసలు తలుచుకుని బ్రతకడానికి. మరి మీకు ..."

"లేదు, డాక్టర్! నేను అనుభవించిన జీవితం ప్రస్తుతం నాకు



**ఒకటి వెనుక ఒకటి . . .**

ఫోటో—ఎస్. ఎన్. రావు (మద్రాసు-28)

తృప్తినివ్వడం లేదు. బ్రతుకంటే భయం ఎక్కువ అయింది. మీరు అన్నట్లు నాకు అనుభవాలు మిగిలి ఉండాలి. నా తరవాత తమ్ముణ్ణి, ఇద్దరు చెల్లెళ్లను నా చేతులమీదుగా పెంచాను, డాక్టర్. కాని, వాళ్లను చూస్తే నాకు కలగవలసిన తృప్తి కలగకపోగా, వీళ్లకోసమా నా జీవితాన్ని వృథా చేసుకున్నాను అనిపిస్తోంది, డాక్టర్. నాకు వాళ్లను చూస్తే అసూయ ... ఆగండి ... నన్ను చెప్పనివ్వండి. యౌవనాన్ని చూస్తే నాకు జెలసీ. పసిడిరేకులలాంటి బుగ్గలు చూస్తే ఉడిగిపోతున్న నా వయస్సు జ్ఞాపకానికి వస్తోంది. మాసిపోతున్న నా సౌందర్యం నన్ను మభ్యపెడుతూంది. ఏం చెయ్యను?" రోజా పువ్వులలాంటి చేతులలో మొహం పెట్టుకుని ఏడుస్తోంది భవాని.

డాక్టర్ విచిత్రంగా చూశాడు ఆమెను. ఏమౌతుంది ఈమె? చాలా తమాషా కేసు.

"చూడండి, మిస్ భవానీ ... ఏ కారణం వల్లనో తెలియదు మీరు జీవితం అనుభవించవలసిన వయస్సులో ఏమీ అనుభవించలేకపోయారు. ప్రకృతి సిద్ధమైన అనుభూతులను అణచుకున్నారు. అవి ఈ నాడు పడగెత్తి మిమ్మల్ని భయపెడుతున్నాయి. నేను డాక్టర్‌గా ఒకటే సలహా ఇవ్వగలను. మీలోని ఏ భావానికి అయినా రూపం ఇవ్వండి. మనస్సులోని కోరికల్ని అణచుకోకండి. అనుభవించండి. కొన్నాళ్లకి మీలో సహజమైన కోరికలు ఉత్పన్నం కావచ్చును. కొంచెం టైమ్ తీసుకుంటుంది. అంతే!"

"కానీ ... డాక్టర్?"

"నాకు అర్థమైంది మీ బాధ. ప్రపంచంకోసం మీరు బ్రతకాలని ప్రయత్నించారో, లేక ఆదర్శాల దేవాలయంలో దేవతగా బ్రతకాలని ప్రయత్నించి ఫెయిల్ అయ్యారో కానీ, జీవితంలో శాంతిని నాశనం చేసుకున్నారు. ఇప్పటికైనా మీకు మీ ఆరోగ్యం ముఖ్యమైతే, నే చెప్పేది వినండి."

"ఏం చెయ్యమంటారు?"

"మీ మనస్సుకు నచ్చిందిచెయ్యండి. ఎవరికీ భయపడకండి. మీలో కోపాన్ని, రోషాన్ని, ఆవేశాన్ని, వాంఛను, పాప పుణ్యాలను గోతులుతీసి, పాతిపెట్టి గోరీలు కట్టకండి. సహజంగా బ్రతకండి. అసలు సగం మానసిక వ్యాధులకు కారణం జీవితంలో సహజత్వం పోగొట్టుకోవడమే నంటాను నేను."

"కాని, నేను మీ సలహా ఆచరించలేనేమో, డాక్టర్! అక్కగా, కూతురుగా, కాలేజీ లెక్చరర్‌గా ఎంతో మంచిగా, నీతిగా బ్రతుకుతున్నాను నేను. కేవలం నా మానసిక శాంతి కోసం ఇప్పుడు నా దారి మార్చుకోనా?! కాని ... కాని, ఇలానూ బ్రతకలేను, డాక్టర్... ఏం చెయ్యను? నాకు బ్రతకాలనుంది, డాక్టర్. ఒక్కసారి మళ్లీ మొదటినుంచీ బ్రతకాలనుంది, డాక్టర్."

జాలిగా చూశాడు డాక్టర్. అతని చూపులు తప్పించుకోవడానికి పక్కకు చూసింది భవాని. 'పక్క గదిలో తనతో వచ్చిన కన్య ఏదో చదువుకొంటూంది. ఆ కెంపుల జూకాలు దాని కెంత బావున్నాయో! అవి నావే!... ఇచ్చెయ్యమనాలి... ఛా! ఛా! ఏమిటిది? నా చెల్లెలిని చూస్తే నాకు అసూయా?'

మానసిక దౌర్బల్యం నుండి డాక్టర్ మాటలు ఆమెను తప్పించాయి.

"పోనీ, ఒక పని చెయ్యండి. మీరు తీరికలేకుండా ఏదో ఒక పని సృష్టించుకోండి. ఏమీ తోచకపోతే, ఏ అనాథ శరణాలయానికో పోయి అక్కడ పసి పిల్లలతో గడపండి. సాధారణంగా పువ్వుల మధ్య, పిల్లలమధ్య శాంతి దొరకని వారు అరుదు."

"నాకు పిల్లలతో గడపాలనుండదు, డాక్టర్! అంతగా పిల్లలు కావాలనుకుంటే నా చెల్లెళ్ల పిల్లలు ఉన్నారుగా? కాని, నాకు వాళ్లంటే గిట్టదు."

"దానికి కారణం వాళ్లు మీ పిల్లలు కాకపోవడం. కాని అనాథ శరణాలయంలో పిల్లలు మీకు అల్లాంటి ప్రెజుడిస్ కలగనివ్వరు. మీ చెల్లెలంటే ఉన్న జెలసీతో మీరు ఆమె పిల్లల్ని అసహ్యించుకుంటున్నారు."

"డాక్టర్!" కళ్లనీళ్లతో తలెత్తి చూసింది భవాని.

"ఏం? నేను అన్నది అబద్ధమా?"

"ఎలా అంటాను? కానీ నా పరిస్థితి ఎంత భయంకరమైంది, డాక్టర్!" ఏడుస్తూ అంది భవాని.

డాక్టర్ విసుగ్గా లేచి నిలబడుతూ, "మీరు ఇలా హిస్టీరికల్‌గా ఉంటే, ఇంట్లోవాళ్లకు, బయటవాళ్లకు కూడా న్యూసెన్స్‌గా తయారౌతారు" అన్నాడు.

"లేదు, డాక్టర్, లేదు! మీ సలహాను ఆచరణలో పెట్టడానికి ప్రయత్నిస్తాను. కొంచెం మొహం కడుక్కునేందుకు నీళ్లు ఎక్కడున్నాయో చెపుతారా? నన్ను ఈ స్థితిలో మా చెల్లెలు చూడటం నాకు ఇష్టం లేదు."

మొహం తుడుచుకుంటూ భవాని అద్దంలో చూసిన దృశ్యంతో ఛ్రున వెనక్కు తిరిగింది. గదిలో డాక్టర్, కన్య ఏదో జోక్ చెప్పుకుని నవ్వుకుంటున్నారు. కన్య స్నేహితురాలి అన్నగారు కావడంవల్ల, డాక్టర్ అపరిచితుడు కాడు కన్యకు. పైగా, వాళ్లిద్దరు యౌవనంలో ఉన్నారు.

గబగబా గదిలోకి వచ్చి, ఏదో సాకుతో అర్జెంటుగా కన్యను లాక్కెళ్లిపోయింది భవాని. కన్య కొంటె నవ్వుతో సగం అర్థమైంది డాక్టర్‌కు. జాలి వేసింది. 'ఏమౌతుంది ఈమె? అయినా సౌందర్యవతి, విద్యావంతురాలైన యువతి ఇలా తయారవడానికి కారణమేమై ఉంటుంది?' అనుకున్నాడు డాక్టర్ మోహన్‌రావు.

• • •

గోపాలంగారి నలుగురి సంతానంలో పెద్దపిల్ల భవాని. భవాని తల్లి దేవీ పూజలు చేసేది. అందుకని పిల్లలకు భవాని, దుర్గ, కన్య, ఉమాశంకర్ అని పేర్లు పెట్టింది. గోపాలంగారు మొదటి నుంచి ఆదర్శాలు మాట్లాడి ఆచరణలో పెట్టి వెంకడి మాట దగ్గరనుంచి, పెళ్లాం మాట వరకు అమలుపరిచేవారు. ఎప్పుడోతప్ప, ఆయన అనుకున్నవి, ఆచరించినవి ఒక్కటి కాలేదు — ఒక్క భవాని పెంపకంలోతప్ప. ఈ విషయాన్ని మొదటినుంచీ గ్రహించింది భవాని తల్లి. కాని చివరవరకూ గ్రహించలేకపోయింది భవాని.

భవానికి పద్నాలుగవ ఏట తల్లి చనిపోయింది. భర్త సంగతి సంపూర్ణంగా అర్థంచేసుకున్న ఆవిడ, పిల్లం కోసం తపించిపోతూ చచ్చిపోయింది.

మనం రూపం ఇస్తే నిలుస్తుంది. లేకపోతే లేదు.''

''మీరు కవిత్వం మాట్లాడగలరు, డాక్టర్!'' నవ్వుతూ అంది భవాని. ''మీ రెండో సలహా ఆచరణలో పెడదా మనుకుంటున్నాను.''

''ఏమిటి?''

''అనాథ శరణాలయం.''

''ప్రయత్నించి చూడండి. ఈ వయస్సులో మీలో మాతృత్వమన్నా నిద్ర లేస్తే, ఏమన్నా మార్పు జరగవచ్చు.''

''వయస్సు ... వయస్సు ... వయస్సు ... దిక్కుమాలిన వయస్సు. ఈ విషయం అందరూ నాకు జ్ఞాపకం చేసేవారే. ఒక్క పదేళ్లు వెనక్కు జరిగితే ఎంత బావుండును!'' రోషంగా అంది భవాని.

''ఆ విషయం మీరు పదేళ్ల క్రిందట ఆలోచిస్తే బాగుండేది. కన్య ఎలా ఉన్నారు?''

''బాగానే ఉంది ... వస్తాను, డాక్టర్'' అంటూ లేచి విసురుగా వెళ్లిపోయింది భవాని. హృదయపు పొరల్లో మెదిలే సన్నటి నీలి నాళాల్లాంటి భావాల్ని వెలికి తెలియకుండా అణుచుకోవాలని ప్రయత్నించేటప్పుడు ఆ రాపిడికి విపరీతమైన చైతన్యం ప్రజ్వరిల్లుతుంది. అది మంచికో, చెడ్డకో పరిణమించవచ్చు. భవాని విషయంలో అదే జరిగింది.

వెళ్లిపోతున్న ఆమె వంకే రెప్ప ఆర్పకుండా చూశాడు స్ఫురద్రూపి, అవివాహితుడు అయిన డాక్టర్ మోహన్‌రావు.

• • •

''ఎలా ఉన్నారు మీ అక్క?'' అడిగాడు డాక్టర్ మోహన్‌రావు కన్యను. అది మోహన్‌రావు చెల్లెలు రమ పుట్టిన రోజు పార్టీ.

''మీ రొక కొత్త బెడద తెచ్చి పెట్టారు, డాక్టర్. ఆదివరకే నయం'' అంది కన్య.

''ఏం?'' ఆశ్చర్యంగా ప్రశ్నించాడు

''అక్కకు అనాథ శరణాలయానికి వెళ్లమని చెప్పారట కదా! రెండు రోజులు వెళ్లి, అక్కడి నుంచి ఒక అమ్మాయిని తీసుకువచ్చింది.''

''తరవాత?''

''ఆ పాపని చిన్నభవాని అని పిలుస్తుంది. నా లక్ష్యం ఇది నాలాగా తయారవకూడదనే అని అంటుంది. ఆ పాప అనాథ శరణాలయంలోనే సుఖంగా ఉండేదేమో?''

''అదేమిటి?'' అంది రమ ఆశ్చర్యంగా.

''మరేమిటి? ఆ పాపకు రకరకాల ఆటబొమ్మలు, గౌన్లు, గాడిదగుడ్డు కొని తన గదిలోనుంచి బయటకు వెళ్లనివ్వదు. తను ఆ పాపను ఎన్‌టర్‌టెయిన్ చెయ్యలేదు. ఆ పాప బయటకు వచ్చి మా దగ్గర ఉంటే జెలసీ.''

''పాపం! ఆవిణ్ణి చూస్తే జాలి వేస్తోంది. మీరంతా కొంచెం ఆవిడతో సహకరించాలి. ఆ పాపను మీరు దూరంగా ఉంచండి. ఆ పాప ప్రేమ ఆమెకే పరిమితం కానీండి.''

''కానీ ఎలా, డాక్టర్? ఆ పసిపిల్ల ఎంతసేపు ఈవిడ భయంకర ప్రేమను భరించగలదట?'' చురుగ్గా చూస్తూ అంది కన్య.

కాసేపు మాట్లాడలేదు మోహన్‌రావు.

''ఇంతకీ ఆవిడ ఎందుకు పెళ్లి చేసుకోలేదట?''



చిత్రం—ఆర్. ఎస్. వి. సుందర్ (హైదరాబాదు-20)

''ఆఁ! ఆవిణ్ణి ఏ రాకుమారుడో వరించి తీసుకువెళితే వెళ్లేదే! జీవితాన్ని ఎదుర్కొనే ధైర్యం ఏమూలా ఆవిడకు లేదు. ఏమైనా, ఇప్పుడు మాకు క్షణం శాంతి లేకుండా చేస్తోంది. మూడు నాలుగు రోజులుగా తన ప్రేమను సహించడం లేదని కాబోలు ఆ పిల్లను చావకొడుతూంది కూడా'' అంది కక్షగా కన్య. ''పోనీ, కొన్నాళ్లు చూద్దాం అనుకుంటే, ఆ పిల్ల ఎన్నాళ్లు భరిస్తుంది, డాక్టర్? పసిపిల్ల, ఆ పాప ప్రేమను పొందేందుకు గదిలో పెట్టి తాళం వేసే విధానంతప్ప మరొకటి లేదా?''

''అవును. ఇది విపరీత పరిణామాలకు దారి తియ్యవచ్చును. అసలు పిల్లల మనస్సులు మరీ సున్నితమైనవి. కొన్నాళ్ళకి ఆ పాప ఆమెను అసహ్యించుకునేంత దూరం పోవచ్చు. చూద్దాం.''

''అన్నయ్యా! కన్యా! డిన్నరుకు టైమ్ అయింది. లేవండి. వెళదాం'' అంటూ లేచింది రమ.

కొంచెం వెనకబడి, మోహన్‌రావును చూసి, ''అక్క మీ దగ్గరకు మొన్న ఒంటరిగా వచ్చిందట కదూ!'' అని అడిగింది కన్య.

''ఊఁ! ఏం?''

''అక్కయ్య గురించి మీ అభిప్రాయం ఏమిటి, డాక్టర్?''

''చాలాబలహీనమైనమనస్తత్వం కల సౌందర్యవతి. ఆవిడంటే నాకు చాలా జాలి, కన్యా!''

''థాంక్స్, డాక్టర్. రండి, వెళదాం.''

• • *

ఆరు నెలలు గడిచిపోయాయి.

''డాక్టర్!'' అంటూ స్ప్రింగ్ డోర్ తోసుకొని చెంగున వచ్చింది కన్య.

''ఏమైంది? అలా ఉన్నారేం? అరె! కూర్చోండి.''

టేబిల్‌మీద తల పెట్టుకుని వెక్కి వెక్కి ఏడ్చింది కన్య. ఆమె దుఃఖం ఉపశమించేదాకా చూస్తూ కూర్చున్నాడు డాక్టర్.

కాస్సేపటికి తలెత్తింది కన్య.

''ఏమైంది?'' మెల్లిగా అడిగాడు డాక్టర్.

''డాక్టర్! అక్క చచ్చిపోయింది, డాక్టర్.''

అదిరిపోయాడు డాక్టర్.

''ఎలా? ఎందుకని?''

ఆమె వెక్కివెక్కి ఏడ్చింది.

''ఆమె చచ్చిపోవడానికి సగం నేనే కారణం, డాక్టర్. సగం మీరుకూడా.''

''నేనా?''

''అవును!''

''అసలు ఏం జరిగిందో చెప్పండి.''

గడ్డం క్రింద చెయ్యి పెట్టుకుని ఆలోచిస్తూ కూర్చుని కాస్సేపు తరవాత మెల్లిగా చెప్పింది కన్య. భవాని చచ్చిపోయిన ఈ సంభైఎనిమిది గంటలలో చాలా మార్పు వచ్చింది కన్యలో.

ఆ రోజు—అంటే మూడు రోజుల క్రితం—చిన్న భవాని తండ్రి దగ్గరకు వెళ్లిందని చావబాదింది భవాని. ఆ పిల్ల విపరీతంగా భయపడిపోయింది. భవానిని చూస్తూనే పారిపోయింది. ''ఛీ! ఛీ! వెధవసంత. ఆ డాక్టర్ చెప్పాడని తీసుకువచ్చాను. నా ఖర్మ'' అని ఆదరగండం చేసింది భవాని.

''ఆయన్నంటావేం మధ్య? నిన్నెవరు తీసుకు రమ్మన్నారు?'' అంది కన్య చిరెత్తి.

''ఏం? అంటాను! ఇంకా అంటాను. నీకేం?''

''అంటే?''

''నా ఇష్టం! ఆ డాక్టర్ మీద నీ బోడి హక్కేమిటి? ఆయనంటే నాకు ఇష్టం. అందుకే చేశాను. సరేనా?'' గట్టిగా అరిచింది భవాని.

కన్యకు ఒళ్లు మండిపోయి, ''ఆయన ఒక డాక్టరు, అక్కా! ఆయనకు నువ్వంటే జాలి తప్ప మరేం లేదని స్పష్టంగా చెప్పారు. ఆయన వయస్సు తమ్ముడు ఉన్నాడు నీకు. ఈ వయస్సులో నువ్వు ఇలా మాట్లాడ్డానికి సిగ్గుపడాలి'' అని ఎదురు తిరిగింది.

అలాగే కన్య వంక తీక్ష్ణంగా చూస్తూ, ఫిట్ వచ్చి పడిపోయింది భవాని.

''బహుశా ఆ రోజు మనిద్దరం మాట్లాడ్డం చూసింది, డాక్టర్. జెలసీతో అన్నదని అనుకోలేక, ఆవిడ పరిస్థితి అర్థం చేసుకోలేక ఎదురు తిరిగాను నేను'' అంది కన్య.

''ఆ తరవాత?''

''ఈ గోలలో నాన్న కల్పించుకునే ధైర్యం చెయ్యలేకపోయారు. తమ్ముడు ఇంటర్‌వ్యూకు వెళ్లాడు. ఈ లోపల పాప ఈ గందరగోళం భరించలేక దుర్గక్క దగ్గరకు పారిపోయిందిట. దుర్గక్క వచ్చేటప్పటికి, పెద్దక్క నన్ను పిలిచి, 'క్షమించు, కన్యా! నిన్ను నేను ఎంతో ప్రేమతో పెంచానే! నిన్ను అనాలని అనలేదు. ఏమిటో ఈ అసహ్యకరమైన బ్రతుకు అనవసరమనిపిస్తూంది. చిన్న భవాని ఏది?' అన్నది.

'ఇంకా భవాని ఎందుకు? చంపడానికా? ఎందుకు ఆ పిల్లను తీసుకు రావడం, చిత్రహింస పెట్టడం? ఆ




మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సాతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!

DOL-327 TEL




ఆంధ్రప్రదేశ్‌కు (తెలంగాణా సహా), ఒరిస్సాకు డిస్ట్రిబ్యూటర్లు :
ప్రగతి ఏజన్సీస్,
పో. బా. నం. 178, పులిపాటివారి వీధి, విజయవాడ

పిల్ల ఇప్పుడు నువ్వు కలలో కనబడినా హడిలి చస్తుంది. ఏమిటీ న్యూసెన్సు?' అని విరుచుకు పడింది దుర్గక్క. ఇదే సమయమని నాన్న నాలుగు మాటలు అన్నారు. నువ్వన్నా పిచ్చాసుపత్రిలో చేరాలి, లేదా మేమన్నా చేరాలి అని అరిచారు. ఏమీ మాట్లాడకుండా, తలెత్తిమాత్రం చూసింది అక్క, గాజు కళ్లతో శూన్యంలోకి తొంగి చూస్తున్నట్లు చూసింది. కానీ ... కానీ ... ఇంత సాహసం చేస్తుందనుకోలేదు మేము."

"ఆత్మహత్య చేసుకున్నదా?"

"స్లీపింగ్ టాబ్లెట్సు మింగింది. చచ్చిపోయిన తరవాతగానీ, అక్కను మేము ఇంత ప్రేమిస్తున్నామని తెలియలేదు, డాక్టర్. మాకోసం సర్వం ధారపోసిన అక్కకు ఏం చెయ్యలేక పోయాం."

"ఇదే ఆమె బ్రతికి ఉండగా అనుకుంటే, ఆమె ఇంత చిత్రహింస పడేది కాదేమో. మరి పోలీసు కేసేమైనా ..."

"లేదు. ఏమీ జరగకుండా రాసి పోయింది" – ఆలోచిస్తూ, డాక్టర్‌ను చూస్తూ అంది కన్య, కొంచెంసేపటి తరవాత.

"డాక్టర్!" వ్యథస్వరంతో పిలిచింది. ప్రశ్నార్థకంగా చూసిన డాక్టర్‌కి "ఇదుగో, ఈ లెటరు మీకు రాసింది అక్క" అని వణుకుతున్న చేతులతో ఇచ్చింది. రెండే లైన్లు ఉన్నాయి.

"డాక్టర్!

బహుశా మీరు ఒక్కరేనేమో నాకు ఆత్మీయులు ... మళ్లీ పుట్టడమంటూ ఉంటే ఇలా మాత్రం బ్రతకను. డాక్టర్!

—భవాని."

డాక్టర్ మోహన్‌రావు కళ్లల్లో నీళ్లు తిరిగాయి. అతడూ మనిషే. అందులో మానసిక శాస్త్రం చదివిన వ్యక్తి.

కాస్సేపు మౌనంగా ఆమె ఆత్మశాంతికి ప్రార్థించాడు డాక్టర్.

తల వంచుకుని కూర్చుంది కన్య.

"కన్యా!"

"ఊఁ!"

"ఎందుకని రాగానే ఈ లెటరు నాకు చూపించలేదు? కనీసం ఆమె పరిస్థితి గురించైనా కబురు పంపలేదు?"

ఆమె పెదవులు వణికాయి.

"మీ దగ్గర దాచలేను, డాక్టర్.. జెలసీ" అని తల వంచుకుంది.

ఆశ్చర్యపడలేదు డాక్టర్. అతడు మనస్తత్వ శాస్త్రవేత్త. ★